www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 డిసెంబర్ 2024
5
పశ్చిమ గోదావరి



యజమానులు పశువులను కట్టడి చేయాలి

లేకుంటే క్రిమినల్ కేసులు

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో 3 రోజుల్లో పశువులను వాటి యజమానులు కట్టడి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేసారు. పట్టణంలో పశువులు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగజేస్తున్నాయన్నారు. పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, పశువుల యజమానులు వీధుల్లోకి వదలకుండా కట్టడి చేసుకోవాలన్నారు. లేదంటే పశువులను గోశాలలకు తరలించి, యజమానులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభ

తరలొచ్చిన నేతలు, ఉపాధ్యాయులు
ప్రశ్నార్థకంగా ప్రభుత్వ పాఠశాలల మనుగడ
యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్
ఉద్యమాలకు సిద్ధం కావాలి
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభ స్థానికంగా పండగ వాతావరణంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి యుటిఎఫ్ నేతలు, పూర్వపు నాయకులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. యుటిఎఫ్ లక్ష్య సాధనకు, అమరుల ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని ప్రతినబూనారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సర్వోత్సవ జిల్లా మహాసభ పిలుపునిచ్చింది.

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ స్మారక ప్రాంగణంలో కీర్తిశేషులు వలవల శ్రీరామమూర్తి వేదికపై యుటిఎఫ్ 50వ స్వర్ణోత్సవ జిల్లా మహాసభ, యుటిఎఫ్ ప్రతినిధుల సభ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. జాతీయ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అలుగు ఇజ్రాయిల్‌రాజు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి సరిపల్లి జయప్రభ, యుటిఎఫ్ పతాకాన్ని యుటిఎఫ్ సీనియర్ నేత జి.రామలింగరాజు ఆవిష్కరించారు. స్వర్ణోత్సవ మహాసభకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, ప్రతినిధుల సభకు యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్ ఆహ్వానం పలికారు. ఈ మహాసభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు అధ్యక్షత వహించారు.



హాజరైన యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు



మహాసభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మహాసభను ప్రారంభించారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు సంతాప తీర్మానాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. కోశాధికారి పట్టాభి రామయ్య, అసోసియేట్ అధ్యక్షులు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శులు కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, సిహెచ్.కుమార్‌బాబ్జి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కెవి.సత్యనారాయణమూర్తి ఆయా నివేదికలు ప్రవేశపెట్టగా ప్రతినిధులు సమగ్రంగా చర్చించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టిజెజె.కుమార్, కెఎస్‌సిహెచ్ సాయిరాం, డి.ఏసుబాబు విద్య, ఆర్థికరంగం, మున్సిపల్ తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.క్రాంతికుమార్, కె.శ్రీరామకృష్ణప్రసాద్, ఎం.శ్రీను బాబు, ఎంవి.రాజశేఖర్, పిల్లి.శ్రీనివాసరావు నిర్వహణా కమిటీగా వ్యవహరించారు. ఎస్.రత్నరాజు, సిహెచ్.నాగశిరోమణి, పి.కృష్ణకుమారి, రాష్ట్ర కౌన్సిలర్ బిజెవిడి.రాజ్యలక్ష్మి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కమిటీగా వ్యవహరించారు.

భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం
యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

రాష్ట్రంలో 3,156 యుపి పాఠశాలలు ఉన్నాయి. 614 పాఠశాలల్లో 6, 7, 8 చదివే విద్యార్థులు 60 మందిలోపు ఉన్నారు. 1104 పాఠశాలలో 30లోపు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. సుమారు 1,300 పాఠశాలల్లో 50లోపు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం 60 మందికిపైగా విద్యార్థులు ఉంటేనే యుపి పాఠశాలలు కొనసాగిస్తామని చెబుతోంది. భవిష్యత్తులో ప్రాథమిక, హైస్కూల్స్ మాత్రమే ఉంటాయి. దీనివల్ల గిరిజన వెనకబడిన ప్రాంతాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయుల సమస్యలపై 50 ఏళ్ల నుంచి యుటిఎఫ్ ఆలు పెరగని పోరాటం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకునేందుకు పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది.

ఉద్యమాలకు సిద్ధం కావాలి
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో పడింది. దీన్ని రక్షించుకోవడంలో యుటిఎఫ్‌గా మనమంతా భాగస్వాములు కావాలి. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై పోరాటాలు సాగించాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. భవిష్యత్తులో ఉద్యమాలకు సిద్ధం కావాలి. టీచర్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ ప్రాబల్యాన్ని మరోసారి నిరూపించినందుకు అందరికీ ఉద్యమ అభినందనలు.



పూర్వపు నాయకులు సత్కరిస్తున్న దృశ్యం

పూర్వపు నేతలకు సత్కారం

50 ఏళ్ల యుటిఎఫ్ ప్రస్థానంలో సంఘ అభివృద్ధికి ఉద్యమాల కొనసాగింపునకు అనేక సేవలందించిన పూర్వపు నాయకత్వాన్ని స్వర్ణోత్సవ మహాసభలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఘనంగా సత్కరించింది. కె.సూర్యనారాయణరాజు, ఇజ్రాయిల్‌రాజు, జయప్రభ, జగన్మోహన్‌రావు, వీరాస్వామి, శ్రీనివాసరావు, పి.విష్ణుమూర్తి, ప్రసాద్, సీతారామరాజు, సోమరాజు, రామలక్ష్మి, పార్థసారథి, బండి సూర్యనారాయణరాజు, రమణమూర్తి, నరసింహరాజు, కనకదుర్గ, బాలయ్య, ఎంఎస్ఆర్‌కె.ప్రసాద్, చిన్న సోమరాజుతోపాటు కీర్తిశేషులైన వలవల శ్రీరామమ్మూర్తి, విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

స్వర్ణోత్సవ క్రీడా బహుమతులు అందజేత

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా అక్టోబర్‌లో వివిధ క్రీడలు నిర్వహించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్, జావెలెన్ త్రో, త్రోబాల్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

ఉద్యమాలే ఊపిరిగా.. ప్రజాక్షేత్రంలో ముమ్మందుకు

సిపిఎం జిల్లా మహాసభ పిలుపు
విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
ముగిసిన సిపిఎం ఏలూరు జిల్లా మహాసభ
జిల్లా కార్యదర్శిగా ఎ.రవి మరోసారి ఎన్నిక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రజాక్షేత్రంలో ఉద్యమాలే ఊపిరిగా ముమ్మందుకు సాగాలని సిపిఎం జిల్లా మహాసభ పిలుపునిచ్చింది. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో మరింత మమేకమై పోరాటాలు సాగించాలని నిర్ణయించింది. మూడు రోజులపాటు స్థానికంగా ఆర్.సత్యనారాయణ (ఆర్ఎస్) స్మారక ప్రాంగణంలో జరిగిన సిపిఎం జిల్లా 26వ మహాసభ ఆదివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. తొలిరోజు శుక్రవారం భారీ ప్రదర్శన, బహిరంగ సభతో మహాసభ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆపై శని, ఆదివారాల్లో ప్రతినిధుల సభ సాగింది. పతాకావిష్కరణతో ప్రారంభమైన ప్రతినిధుల సభ నిర్వహణకు వివిధ కమిటీలను ఎన్నుకోవడంతోపాటు ఈ కాలంలో మరణించిన నేతలకు, కార్యకర్తలకు ఘనంగా నివాళులర్పించింది. అనంతరం తెల్లం రామకృష్ణ, డిఎన్‌విడి ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎన్.పద్మాంజలి అధ్యక్షవర్గంగా మహాసభను ముందుకు నడిపించారు. ప్రారంభోపన్యాసం వి.ఉమామహేశ్వరరావు చేశారు. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలను వివరించారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలు, చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ఆయా రంగాల ప్రతినిధులు చర్చల్లో పాలొన్నారు. అనంతరం మహాసభ ఆ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లాలో ఏజెన్సీలో భూ సమస్యలు, నిర్వాసితుల అవస్థలు, ఎర్రకాల్వ మిగులు భూముల పోరాటం, చింతలపూడి ఎత్తిపోతల భూనిర్వాసితులు, దోసపాడు అసైన్డ్ భూములు, వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల స్థితిగతులు, అసంఘటిత రంగ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మహాసభ చర్చించి పలు తీర్మానాలు ఆమోదించింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపర్చేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలతో మరింత మమేకమై స్థానిక సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, విశాఖ రైల్వేజోన్ వంటివి కేంద్రం చేతిలోనే ఉన్నా పట్టించుకోకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా మహాసభ తీర్మానాల అమలుకు పోరాటాలు ఉధృతంగా సాగించాలని, నిరంతరం ప్రజల వెన్నంటి ఉండాలని సూచించారు. ఆహ్వాన సంఘం కార్యదర్శి ఏర్పాట్లను వివరించి, వలంటీర్లను పరిచయం చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

సిపిఎం నూతన జిల్లా కమిటీ ఇదే..

సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఎ.రవి మరోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా గుడిపాటి నరసింహారావు, తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, ఎ.ఫ్రాన్సిస్, ఎం.జీవరత్నం, పి.మంగరాజు, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, ధర్ముల రమేష్, నండూరి హనుమాన్లు, ఎస్.మహంకాళిరావు, కారం భాస్కర్, మడకం సుధారాణి, కె.పోశమ్మ, ఎన్.రమణరావు ఎన్నికయ్యారు.

పొట్టి శ్రీరాములు తాగ్యం మరువలేనిది

హోంమంత్రి అనిత నివాళి

ప్రజాశక్తి- పాలకొల్లు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఆదివారం హోంమంత్రి పాలకొల్లు వచ్చిన సందర్భంగా సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఎందరో త్యాగధనులు చేసిన త్యాగం వల్ల మన దేశానికి స్వాతంత్రం, రాష్ట్రానికి స్వతంత్ర ప్రతిపత్తి వచ్చిందని చెప్పారు. ఆ మహానుభావుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాటూరి నరసింహమూర్తి, రేపాక ప్రవీణ్ భాను, టిడిపి నేతలు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన హోంమంత్రి అనిత

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వశిష్ట సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి అయిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు ఆంధ్రులకు చిరస్మరణీయుడు అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు ఆయన మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరి జనోద్ధరణ వంటి ఆశయాల సాధనకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అన్నారు. 1930వ సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, జైలు శిక్ష అనుభవించారన్నారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు 57 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగానికి పూనుకొని, అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు మనందరికీ మార్గదర్శకులు అని కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్ కెఎస్ఎస్ గణపతి రావు, జిల్లా కలెక్టరేట్ ఎఒ నరేష్ చంద్రశేఖర్, అసిస్టెంట్ బిసి సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు, డిఇఒ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణ, సూపరిటెండెంట్ టి.తిరుపతి రాజు, సీనియర్ అసిస్టెంట్ పి.కుమార్‌స్వామి, హెచ్‌డబ్ల్యుఒలు చిటికెలు మోహన్ రావు, జయంతి, కడలి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

అదానితో ఒప్పందాలను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం అదానితో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలనూ వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో 38వ వార్డు లంకపేటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ఒకవైపు పనుల్లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు వేయడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేయడం మానుకోవాలని, లేకుంటే గత వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, కొమరగిరి సాయమ్మకుమారి, కొమరగిరి రమేష్ సామ్యూల్ రాజు, స్థానికులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నేతలు

ఏటిగట్ల రక్షణలో జగన్ విఫలం

ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

గత ఐదేళ్ల పాలనలో వశిష్ట గోదావరి ఏటిగట్ల రక్షణకు చర్యలు చేపట్టడంలో జగన్మోహన్ రెడ్డి సర్కార్ వైఫల్యం చెందిందని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆరోపించారు. ఆచంట మండలం కోడేరు వశిష్ట గోదావరి వెంబడి కృంగిపోయిన ఏటిగట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెనుగొండ మండలం చినమల్లం పర్యాటక కేంద్రం వద్ద పుష్కరాల స్థాన ఘట్టాన్ని అభివృద్ధి పరచాలని స్థానికులు కోరారు. సిద్ధాంతం కేదార్ ఘాట్, పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం వద్ద, కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, పుచ్చలంక, నాగుల లంక, కోడేరు లంక, పుష్కర్ ఘాట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. లంక భూములు కోతకు గురైనవి పరిశీలించి, రక్షణ చర్యలు చేపట్టాలని గోదావరి హెడ్ వర్క్ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల ప్రభుత్వంలో గోదావరి ఏటిగట్టు ఇసుక, మట్టి యధేచ్ఛగా తవ్వి, జేబులు నింపుకున్న వైసిపి నేతలు ఏటిగట్లు గాలికి వదిలేసారని విమర్శించారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం గోదావరి ఏటిగట్ల రక్షణకు చర్యలు చేపడుతుందని చెప్పారు. కిలోమీటర్ల పొడవు ఏటిగట్లు కృంగిపోయాయని, వాటిని పున: నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాస రావు, డిఇ జి.శ్రీనివాసరావు, నరసాపురం సెక్షన్ హెడ్ వర్క్ లోయర్ ఎఇ సుబ్బారావు, సిద్ధాంతం హెడ్ వర్క్ హయ్యర్ ఎఇ పవన్ కుమార్, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఆచంట మండల అధ్యక్షులు కేత మిరయ్య, ఆచంట నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బిరా నరసింహమూర్తి, తమ్మినేడి ప్రసాద్ గణపతి, నీటి రాంబాబు, భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు, మాజీ సర్పంచి పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం, మడిమెట్ల సీతారామచంద్రమూర్తి(రాంబాబు), రాజా, సోమరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

సేవ్ చైల్డ్ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర చాలా కీలకమని హోంమంత్రి వంగలపూడి అనిత, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో సేవ్ ది గర్ల్ చైల్డ్' 2కె రన్ కార్యక్రమాన్ని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 2కె రన్ గాంధీ బొమ్మల సెంటర్ నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల మీదుగా సాగి మరలా గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకుంది. ర్యాలీలో విద్యార్థుల సేవ్ ది గర్ల్ చైల్డ్ స్లోగన్లతో పట్టణమంతా మారుమోగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలోనే కాదు సేవ, అవగాహనా కార్యక్రమాల్లో పాలకొల్లు నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని అది నిమ్మల రామానాయుడుకే సాధ్యమని తెలిపారు. బుడమేరు మూడు గండ్లను పగలూ రాత్రీ తేడా లేకుండా శ్రమించి పూడ్చి విజయవాడలో ఆరు లక్షల మంది ప్రజల ప్రాణాలు కాపాడిన మహోన్నత వ్యక్తి రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమానికి బాలికలతో పాటు బాలురు కూడా హాజరయ్యారని, తన చెల్లిని, తన అక్కను కాపాడుకోవాలని తపన కనబడుతోందని తెలిపారు.అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడుతున్నారన్నారు. ఆడపిల్లలు పుట్టినప్పుడు గర్భస్రావం చేయడం లేదా చంపడం అనేది నీచ సంస్కారమని తెలిపారు. పసికందు సైతం అత్యాచారానికి గురికావడం సభ్య సమాజం తలదించుకునే అంశం అన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ మహిళలు గౌరవించాలన్నారు. ఆనాడు ఎన్‌టిఆర్ మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించారన్నారు. ప్రపంచంలోనే మన రాష్ట్రానికి టిడిపి హయాంలోనే డ్వాక్రా సంఘాలు ఏర్పాటయ్యాయని, లక్షలాది మంది మహిళలు సాధికారత సాధించి, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకున్నారన్నారు. 2014లో శాసనసభ్యులైన తర్వాత సేవ్ ద గర్ల్ చైల్డ్, 2కె రన్ కార్యక్రమాన్ని రెండేళ్లకోసారి నిర్వహిస్తున్నామన్నారు. ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద అని తెలిపారు. ఆ సంపదను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు అడుగులు వేయాలన్నారు. గత వైసిపి పాలనలో ఇబ్బందులు పడ్డ మహిళలందరికీ పెద్దన్నలా చంద్రబాబు అండగా ఉండి అన్నివిధాలా ఆదుకుంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆడపిల్లల కోసం ఇంత మంచి కార్యక్రమం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు అభినందనీయులు అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రభుత్వాలు చేయడం చూశానని, శాసనసభ్యులుగా, రాష్ట్ర మంత్రిగా చేయడం అభినందనీయమని తెలిపారు. బచిన్నారులు, మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పోటీపడే అవకాశాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు సినీ గాయకురాలు మధుప్రియ, బ్రహ్మముడి సీరియల్ నటి దీపిక రంగరాజన్, గాయకురాలు చిత్రలేఖ, సినీ ప్లే బ్యాక్ సింగర్ బేబీ వేద వాగ్దేవి వీరి పాటలు, సందేశాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ప్రజలను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మంత్రి నిమ్మల సతీమణి సూర్యకుమారి, కుమార్తె శ్రీజ, నాయకులు పాల్గొన్నారు.




సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి అనిత, మంత్రి నిమ్మల

బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గిస్తే ఊరుకోం

ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి

తణుకు : బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించే ఆలోచన కేంద్ర ప్రభుత్వం విడనడాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ జిల్లాల కమిటీ సమావేశం తణుకు బార్ అసోసియేషన్ హాలులో మేక ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకు న్యాయవాదుల వృత్తిలో ఏవైనా లోపాలు జరిగినా దానిపై విచారణ జరిగే అధికారం ఆ రాష్ట్రంలో ఉన్న బార్ కౌన్సిల్‌కి ఉందని మునిస్వామి అన్నారు. కాని నేడు కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించి, న్యాయ వ్యవస్థకు న్యాయవాదులపై చర్యలు తీసుకునే విస్తృత అధికారాలను కట్టబెట్టాలనే ఆలోచనలు ఉన్నాయని మునిస్వామి అన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ ఎన్‌టిఆర్ నేస్తం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అన్నారు. బార్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.35 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు జరిగే సర్టిఫికెట్ వెరిఫికేషన్ విధానంలో జూనియర్ న్యాయవాదులను మినహాయించాలని బార్ కౌన్సిల్‌కి విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదులకు జిల్లా స్థాయిలో క్లాసులు నిర్వహించాలని, స్థానిక బార్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లాలని, న్యాయవాదుల రక్షణకు సమగ్రమైన చట్టాన్ని ప్రభుత్వం చేయాలని, న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్సును ప్రభుత్వం చెల్లించాలని పలు తీర్మానాలు సమావేశం చేసింది. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొవ్వూరు వెంకటేశ్వర్లు, పి.లక్ష్మీ, పామర్తి, జి.రాజారావు, వై.మణికంఠ పాల్గొన్నారు.



వైటి రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు


ఘనంగా రాజా జయంతి

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి వైటి రాజా అని మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు కొనియాడారు. ఆదివారం మాజీ ఎంఎల్ఎ యలమర్తి తిమ్మరాజా(వైటి రాజా) జయంతి సందర్భంగా తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కార్యాలయం వద్ద వైటి రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ సామాజిక సేవలు అందించడంలో వైటి రాజా ముందుండేవారని, టిడిపి పట్ల ఆయనకున్న నిబద్ధత, నిజాయితీ వెలకట్టలేనిదని అన్నారు. ఆఖరి శ్వాస వరకు పార్టీ చిత్తశుద్ధితో సేవలు అందించినటువంటి మహోన్నత వ్యక్తి వైటి రాజా అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు మార్గదర్శకంగా ఉండే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, వావిలాల సరళాదేవి, వంటెద్దు రాజా, గుమ్మళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం

మాజీ ఎంఎల్ఎ వైటి రాజా జయంతి సందర్భంగా తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ పి.కృష్ణకిశోర్ పాల్గొని సుమారు 100 మందికి వైద్య సేవలు, సలహాలు అందజేశారు. అవసరమైన వారికి రోటరీ క్లబ్ తరుపున ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దిన అరుణాదేవి, అనపర్తి ప్రశాంతరావు ధన సహాయం అందించగా, ఒకేషనల్ సర్వీస్ సెంటర్ శ్రీనిధి ఆసుపత్రి పోతుల శ్రీనివాసరావు సాంకేతిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు(బాబీ), కె.సిద్ధార్థ, వి.వెంకటరావు, కె.సత్యనారాయణరావు, గమిని రాంబాబు, రెడ్డి రంగారావు, కెడివి రెడ్డి, బై.బాబూరావు, బసవ రామకృష్ణ, వై.హనుమంతరావు, మేడికొండ వెంకటేశ్వరరావు, అక్కిన కాశీవిశ్వనాథం, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



డిప్యూటీ స్పీకర్‌ను సన్మానిస్తున్న నేతలు

మమ్మల్ని గుర్తించండి..

కనకరాజు సూరి ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

'మమ్మల్ని గుర్తించండి.. మాకు కనీస గుర్తింపు ఉండటం లేదు' అంటూ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ కనకరాజు సూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు శాసనసభ ఉపసభాపతిగా పదవీ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు స్థానిక శాంతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో ఘన పౌర సన్మానం నిర్వహించారు. ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కనకరాజు సూరి పాల్గొని మాట్లాడారు. స్థానికంగా పార్టీలో తమ పార్టీ కార్యకర్తలకు తగిన ప్రాతినిధ్యం, గుర్తింపు లభించటం లేదని అన్నారు. రామాయణంలో రాముడికి వానరసైన్యం తరహాలో తమ కార్యకర్తలు పనిచేశామని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికలలో తగిన ప్రాతినిధ్యం లభించలేదని ఆయన చెప్పారు. ఆయన మాటలకు ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సమాధానం చెప్పారు. పార్టీ అగ్ర నాయకులు ఇరువురు పూర్తిస్థాయిలో కలిసి ఉన్నారని, అదే పందాలో మనం వెళ్లాలని సూచించారు. జనసేనకి పూర్తి గుర్తింపు ఉందని, చిన్నచిన్న అంశాలను సవరించుకుందామని సూచించారు. అనంతరం టిడిపి నాయకులు రఘురామకృష్ణరాజు, కనకరాజు సూరి, మంతెన రామరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మొటిపల్లి ప్రసాద్, పార్టీ నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమ అనంతరం స్థానిక దొర గారి చెరువు వాకింగ్ ట్రాక్, స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ పేషెంట్లకు భాగాన్ని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ప్రారంభించారు.



మోగల్తూరు : కేక్ కట్ చేస్తున్న నాగరాజు

ఘనంగా రామరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతూరి రామరాజు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో రామరాజు పుట్టినరోజు వేడుకలను నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేకును నాగరాజు, మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచి కలిదిండి కుమార్ బాబు, బొల్లా చంటిలు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల రాంబాబు, కొల్లాటి భోగరాజు, వెలిది పుల్లారావు, పంపన భగవాన్, కడలి చంటి, పెచ్చటి నాగేశ్వరరావు, పితాని శేఖర్, చెల్లుబోయిన పెద్దిరాజు పాల్గొన్నారు.

నరసాపురం : టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు జన్మదిన వేడుకను ఆదివారం తెలుగుతమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. పట్టణ, మండల, మొగల్తూరు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. రామరాజు స్థానికంగా లేకపోవడంతో ఆయనకు పలువురు ఫోన్లు చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కత్తిమండ ముత్యాలరావు, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, పాలా రాంబాబు, వి.నాగబాబు, అందే రామకృష్ణ పాల్గొన్నారు.



నరసాపురంలో..

పెట్టుబడి బారెడు.. ఆదాయం మూరెడు

ఖరీఫ్ సాగులో రైతులకు అంతంతమాత్రమే ఆదాయం

దాళ్వా సాగుపై ఆశలతో ముందుకు..



నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

ఖరీఫ్ సేద్యంలో పెట్టుబడులు విపరీతంగా పెరగడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం, సాగులో ఆలస్యం వంటి కారణాలతో అన్నదాతలు నష్టపోతున్నారు. మండలంలో సార్వమాసులు ముమ్మరంగా జరుగుతుండగా మరో పక్క దాళ్వా సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. సార్వ సీజన్ ప్రారంభంలో అధిక వర్షాలు, వరదల కారణంగా అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న రైతన్నలకు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంట కాలవల్లో నీరు నిండుగా ప్రవహించడం, అప్పుడప్పుడు వర్షాలు కూడా పలకరిస్తుండడంతో రైతులు దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు దమ్ములు చేయిస్తూ నారుమడుల పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేలు సాయం ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా చివరకు చేతులెత్తేసిందని రైతులు వాపోతున్నారు. జూన్‌లో వర్షాలు, వరదల కారణంగా నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నా ఇంతవరకూ ఎలాంటి ప్రభుత్వసాయం అందలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం ప్రారంభమైనప్పటి నుంచి రైతులు ప్రయివేట్ వ్యక్తుల వద్ద వేల రూపాయలు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంట సాగు చేస్తున్నారు. ఈ తరహాలో పంట అంతంత మాత్రమే ఉండడంతో, ఒక పక్క తుపాన్ ప్రభావం, మరో పక్క తేమ శాతం పేరుతో పండించిన పంటను దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేయడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఆచంట మండలంలో 10, 13 ఎకరాల్లో దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు తెలిపారు. ప్రస్తుతం సార్వాసాగు మాసూళ్లు మరో వారంలో పూర్తవుతాయని, దాళ్వానాట్లు జనవరి మొదటి వారంలో ప్రారంభమవుతాయని, సార్వమాసులు చేసిన రైతులు వెంటనే దాళ్వా నారు మడలు వేసుకోవాలని ఆయన సూచించారు.

పెట్టుబడులు అధికమయ్యాయి

నెక్కంటి ఆంజనేయులు, కౌలు రైతు, ఆచంట



ఎన్నడూ లేని విధంగా ఈ సార్వా పంటలో పెట్టుబడులు అధికమయ్యాయి. సార్వా పంట ప్రారంభంలోనే అధిక వర్షాలు, వరదల వల్ల తీవ్రంగా నష్టపోయాం. ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు అయ్యాయి. ఒక పక్క వాతావరణం అను కూలించకపోవడంతో సార్వా సాగు ఆలస్యం అయ్యింది. వ్యవసాయం చేసి ఏటా అప్పుల పాలవుతున్నాం. ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు.



ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

పెట్టుబడి ఘనం..

పితాని రంగారావు, కౌలు రైతు, ఆచంట



ఖరీఫ్‌లో పెట్టుబడులు అధికమయ్యాయి. పంట ప్రారంభ దశలో కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతినడంతో చాలా చోట్ల మళ్లీ నారుమడులు పోయవలసి వచ్చింది. కోతల మాసూళ్ల పూర్తికాకుండానే ఎకరాకి రూ.25 వేల వరకు ఖర్చు చేశాను. ఒక పక్క సార్వా మాసూల్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో పక్క దాల్వా సాగుకు సిద్ధమవుతున్నాము. ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేపట్టాము. ఈ పంట అంతంత మాత్రమే ఉంది. దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేయడంతో నష్టాలు తప్పడం లేదు.

వీధికుక్కల స్వైర విహారం

ముగ్గురు పిల్లలకు గాయాలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పా ర్కురోడ్లోని సాయి బాబా ఆలయం వద్ద ఆదివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ముగ్గురు పిల్లల్ని గాయపర్చింది. గుడి సమీపంలో ఆడుకుంటున్న ఇద్దరు పిల్లల్ని ముందుగా కరిచింది. వారు కేకలు వేయడంతో స్థానికులు ఆ కుక్కను తరిమేశారు. అటు నుంచి పారిపోయి శునకం 13వ వార్డుకు చేరింది. ఆక్కడ రోడ్డుపై ఉన్న మరో పిల్లవాడిని కరించింది. అయితే శునకాన్ని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించినా చిక్కలేదు. గాయపడిన ముగ్గురు పిల్లల్ని ప్రభుత్వ అస్పత్రికి తరలించి వ్యాక్సిన్ వేయించారు.



సర్జికల్ అంకాలజీ విభాగం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

వైద్య సేవలు విజయవంతం కావాలి


ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మీరందించే వైద్య సేవలు విజయవంతం కావాలని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. డిఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్ రోడ్లో 32 డెంటల్ హాస్పిటల్ సమీపంలో ఆదివారం ప్రారంభమైన ప్రియాంక స్కిన్ క్లీనిక్, సత్యం ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో సర్జికల్ అంకాలజీ విభాగం ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రియాంక స్కిన్ క్లినిక్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. భీమవరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, వైద్య రంగంలో కూడా సూపర్ స్పెషాలిటీ, మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ప్రస్తుత జీవన సరళిలో కేన్సర్, చర్మవ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఆ వ్యాధులు వారికి అవసరమైన వైద్య చికిత్సలను సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, చర్మ వ్యాధులకు డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక వర్మలు వైద్య సేవలను అందించి విజయవంతం కావాలని విశిష్ట అతిథి అంజిబాబు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గౌరవ అతిథి నరసాపురం మాజీ ఎంఎల్ఎ, మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు మాట్లాడుతూ భీమవరం మెడికల్ హబ్‌గా ప్రాధాన్యతను సంతరించుకుంటుందని, ఇటువంటి చోట కేన్సర్ వైద్య చికిత్సలు, శస్త్ర చికిత్సలు, చర్మవ్యాధుల చికిత్సలు అందించడానికి దంపతులైన వైద్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సత్యం ఆర్థోపెడిక్ మెడిసిన్, సర్జరీ హాస్పటల్లో సర్జికల్ ఆంకాలజీ, లాప్రోస్కోపీ విభాగంను ప్రసాదరాజు ప్రారంభించారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ, డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక వర్మలు వైద్య సేవలలో తమ విభాగాల్లో ఖ్యాతిని తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆనంద గ్రూప్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు మాట్లాడుతూ గతంలో కేన్సర్ వైద్య చికిత్సలు చేయించుకోవాలంటే ఎక్కడో ఉన్న రాయవెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీకి వెళ్లవలసి వచ్చేదన్నారు. నేడు వైద్యులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రంగాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు చైతన్యంతో వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. స్వస్థలంలో వైద్య సేవలు అందించాలన్న సేవాభావంతో కృత నిశ్చయంతో డాక్టర్ వంశీకృష్ణ, ప్రియాంక వర్మ దంపతులు భీమవరంలో వైద్య సేవలను ప్రారంభించారన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, డిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు బాబు, పొత్తూరు బాపిరాజు, గనిరెడ్డి త్రినాథ్, గుంటూరు పెద్దిరాజు, ఎఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల




పెదఅమిరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు సత్కారం

ఉండి నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘ అధ్యక్షులు, ఎపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజును ఆదివారం పలువురు అభినందించారు. పెదఅమిరంలోని ఆయన నివాసంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆయన్ని కలిసి సన్మానించారు. ఈ సత్కారంలో బొండాడ సాగునీటి సంఘం అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి, సిసలి నీటి సంఘం అధ్యక్షులు తోట ఫణిబాబు, పలు సాగునీటి సంఘాల అధ్యక్షులు, టిసి సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల త్యాగనిరతి గొప్పది

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు




పెనుమంట్రలో నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

భాషా ప్రయోక్త రాష్ట్రాల ఏర్పాటులో పునాది వేసింది అమరజీవి పొట్టి శ్రీరాములు అని, వారి త్యాగనీరతి గొప్పదని మనవత జిల్లా కార్యవర్గ సభ్యులు, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని మార్టేరు సెంటర్‌లో అమరజీవి వర్ధంతి ఘనంగా జరిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని ఛైర్మన్ కడలి సుబ్రమణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, ఇసి హెల్త్ సభ్యులు పడాల రామచంద్రారెడ్డి, కోశాధికారి చదువుల నరేంద్ర, సభ్యులు అమృతవాకల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రాణ త్యాగం ఫలితంగానే రాష్ట్ర ఆవిర్భావం జరిగిందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఉదయం పెనుమంట్ర మండలం మార్తేరు సెంటర్లో అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి పురస్కరించుకుని శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



నరసాపురంలో..

భాషా ప్రయోక్త ఏర్పాటుకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు అన్నారు. వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మెమెంటోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్టేరు పంచ గ్రామాల ఆర్యవైశ్య సంఘ నాయకులు అనిమల్ శెట్టి రాంబాబు, కాశీ విశ్వనాథం(విస్సు), ఎన్‌డిఎ కూటమి నాయకులు కర్రి అచ్యుతరామిరెడ్డి, తేతలి రాజారెడ్డి పాల్గొన్నారు.

నరసాపురం : తెలుగువారి ప్రత్యేక రాష్ట్రం కోసం బలిదానం, ఆత్మార్పణం చేసుకున్న పొట్టి శ్రీరాములు అమరజీవి అని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాడు పొట్టి శ్రీరాములు అంతటి త్యాగం చేయకపోతే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడేవి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు వైకెఎస్, మున్సిపల్ సభ్యులు నిర్మలకుమారి, ఆర్ఐ నానాజీ పాల్గొన్నారు.



తణుకులో..

తణుకు : సమాజం కోసం ప్రాణాల్ని త్యాగం చేయడం పొట్టి శ్రీరాములు దేశభక్తికి నిదర్శనమని కూటమి నాయకులు అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ నాయకత్వంలో కూటమి నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెలుగు వారి ఆత్మగౌరవం నిలబెట్టేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, బసవ రామకృష్ణ, వావిలాల సరళాదేవి, వంటెద్దు రాజా, తాతాపూడి మారుతీరావు, చదలవాడ నాని పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాన్ని నేటి యువతరం అర్థం చేసుకుని సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై స్పందించాలని, అప్పుడే అధికారులు, ప్రభుత్వం, ప్రజల ఎడల బాధ్యతగా ఉంటాయని రవీంద్రనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, జల్లూరి జగదీష్, వాణిజ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేతతో తీవ్ర ఇబ్బందులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఉండి

ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా మరమ్మతుల పేరిట 165వ జాతీయ రహదారిలోని ఉండి రైల్వే గేటు మూసివేయడంతో ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైల్వే ట్రాక్ మరమ్మతులు చేయడం ఉత్తమమైనదే అయినప్పటికీ ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయకుండా గేటు మూసివేయడం సరికాదని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఆర్ఒబి పూర్తి కాకపోవడం వల్ల రైల్వే గేట్ సమీపంలోని రహదారి మొత్తం అధ్వాన స్థితికి చేరినప్పటికీ తప్పని పరిస్థితుల్లో తమ ప్రయాణం సాగిస్తున్నామని, ప్రస్తుతం గేటు మూసివేయడంతో గేటు అవతలి వైపుకు వెళ్లడానికి సుమారు పది కిలోమీటర్ల ప్రయాణం చేసి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు సైకిల్ వెళ్లే మార్గం అయినా ఏర్పాటు చేస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.



దారి లేక పట్టాలు దాటుతూ పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

ఇదిలా ఉండగా గత ప్రభుత్వం రైతుల పట్ల, రైస్ మిల్లర్ల పట్ల వ్యతిరేక ధోరణి అవలంభించడంతో మండలంలోని చాలా వరకు రైస్ మిల్లులు మూతపడ్డాయని పలువురు రైతులు తెలిపారు. పంట చేతికందే సమయంలో వాతావరణంలో మార్పులు సంభవించడంతో పెదపుల్లేరు రహదారిలోని కుమారస్వామి రైస్ మిల్లుకు, వైష్ణవి రైస్ మిల్లుకు, ఆకివీడు రహదారిలోని శ్రీనివాస మోడ్రన్ రైస్ మిల్‌కు మాత్రమే రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఉందన్నారు. ప్రస్తుతం రైల్వే గేటు మూసివేయడంతో ఉండిలోని వ్యవసాయ రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి గేటు అవతలికి వెళ్లడానికి సుమారు 25 కిలోమీటర్లు దూరం ఎక్కువ అవడంతో రైతులపై భారం అధికమవుతుందని వాపోయారు. ధాన్యం అమ్ముకోగా వచ్చిన డబ్బులు కిరాయి రూపంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఉండికి చెందిన రైతు మానే వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

రాజులపాలెంలో ఉద్రిక్తత

ఫిటీషన్ వెనక్కి తీసుకోకపోతే ధర్మపోరాటం

నరసాపురం : మండలంలోని సీతారాంపురం సౌత్ రాజులపాలెంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద పెద్ద ఎత్తున గ్రామస్తులు చేరుకుని సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆలయాన్ని తొలగించాలని వేసిన ఫిటిషన్‌పై పెద్దలు మరోసారి సమీక్షించారు. తక్షణం ఫిర్యాదుదారుడు దీన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ధర్మపోరాటం చేయాలని తీర్మానించారు. గ్రామస్థుల ఆందోళనకు ఆర్ఎస్ఎస్, భజరంగ్ దల్, హిందుదార్మిక సంస్థలు సంఘీభావం తెలిపాయి. ఇటు ఆలయం వద్ద గ్రామస్థులు సమావేశం అవుతున్నారన్న విషయాన్ని తెలుసుకుని పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐలు వాసు, టి.వెంకట సురేష్, వై.నాగలక్ష్మి, 20 మంది సిబ్బందిని బందోబస్తుకు నియమించారు. ఇటు రెవెన్యూ అధికారులు కూడా గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తుల సమావేశం తరువాత ఏం జరుగుతుందని అంతా టెన్షన్ పడ్డారు. ధర్మపోరాటమే చేయాలని తీర్మానించడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సమావేశంలో కొండేటి త్రినాథ్, గణపతిరాజు, సుబ్బరాజు, జగన్నాధరాజు, వేజి పాల్గొన్నారు.

14 అంశాలతో బాలోత్సవం పోటీలు

భీమవరం టౌన్ : ఈనెల 28, 29 తేదీలలో బాలోత్సవం సందర్భంగా 14 అంశాలతో విద్యార్థులకు కల్చరల్ పోటీలు భీమవరంలోని చింతలపాటి బాపిరాజు హైస్కూల్లో నిర్వహించినట్లు భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. స్థానిక కస్తూరిబాయ్ కళాశాలలో జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు అయిన భీమవరం, ఆకివీడు, ఉండి, పాలకోడేరు, కాళ్ల, వీరవాసరం మండలానికి చెందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు 22వ తేదీ లోపు తన వివరాలను 9949093115కు సంప్రదించగలరని తెలిపారు.

జాతీయ సమైక్యత యూత్ హాస్టల్స్ లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పర్యాటకం, అడ్వెంచర్ స్పిరిట్, జాతీయ సమైక్యత, విద్య, ఆరోగ్యం ప్రోత్సహించడం, పరిమిత మార్గాల్లో మిలియన్ల మంది యువతకు వారి ప్రయాణ సమయంలో సరసమైన ధరలకు స్థిరమైన ప్రాతిపదికతో సాహసాలు చేయించడం యూత్ హాస్టల్స్ లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరం త్యాగరాజ భవనంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. సామాజిక, అభివృద్ధి సమస్యలపై యువతలో అవగాహన పెంపొందించడం యూత్ హాస్టల్స్ ప్రత్యేకత అని, యువతలో పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరగటానికి, విద్య, జీవన నైపుణ్యాలు పెరగటానికి యూత్ హాస్టల్స్ చేస్తున్న సేవలు అమోఘమని అన్నారు. మంచి కార్యక్రమాలు చేయుట ద్వారా యూత్ హాస్టల్స్ భీమవరం యూనిట్ దక్షిణ భారతదేశంలో 2వ అతి పెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. యూత్ హాస్టల్స్ జాతీయ ఛైర్మన్ మనోజ్ జోహిరి, నేషనల్ వైస్ ఛైర్మన్ రబీ శంకర్ పాల్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో 2వ అతి పెద్ద యూనిట్‌గా భీమవరం యూనిట్ గుర్తింపు తెచ్చుకోవడం గొప్ప విశేషమని, మొదటి స్థానంలోకి రావడానికి మరింత ప్రయత్నం చేయాలని అన్నారు. అనంతరం 10 రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి విచ్చేసిన 100 మంది యూత్ హాస్టల్స్ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ఛైర్మన్ డాక్టర్ వివి.సోమరాజు, మాట్లపూడి సత్యనారాయణ, భీమవరం అధ్యక్షులు చిలుకూరి నరసింహరాజు, కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్, కార్యదర్శి నందమూరి రాజేష్, బోండా శ్రీరామ్, పాండు రంగారావు, అరేటి సత్యనారాయణ, చెరుకువాడ రంగసాయి, జనపాటి మధుసుధన్ రావు, మల్లినీడి తిరుమలరావు పాల్గొన్నారు.

మాలల మహాగర్జనకు తరలిన నేతలు

ఆచంట: ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో జరిగిన మాలల మహా గర్జనకు మండలం నుంచి నేతలు ఆదివారం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చీకటిమెల్లి మంగరాజు, గుమ్మాపు సూర్య వర ప్రసాద్, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, మట్టా చంటి, నాగిపల్లి శ్రీనివాస్, సబిత మధు ఉన్నారు.

నరసాపురం : గుంటూరులో ఆదివారం జరిగిన మాలల మహాగర్జన సభకు తీర ప్రాంతం నుంచి మాలల న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో దళితులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. సెంటర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సోడదాసి శ్రీధర్, బుల్లిరాజు, దొండపాటి స్వామి, రవి, జగదీష్, సుధాకర్, దీన మనస్సు, జయపాల్, భారత్, రాంమోహన్, చిన్నిలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

నరసాపురం: మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కంచర్ల యుగంధర్ వెంకట శివ పాపారావు(33) శనివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిసిన వివరాల ప్రకారం మండలంలోని సార్వ గ్రామంలో ట్రాక్టర్‌తో వరి చేనులో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యుగంధర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం యుగంధర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందజేశారు. దీనిపై మృతుడు భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. మృతుడు యుగంధర్‌కు నాలుగేళ్ల క్రితం కృష్ణాజిల్లా కృత్తివెన్ను గ్రామానికి చెందిన సునీతతో వివాహమైంది. వీరికి మూడేళ్ల లోపు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇంతలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.